# జుట్టుపోలిగాడి కత

"అహా! యాడైనా ఉంటిందా యింత అన్యాయం? నోరు అట్టా తెరిస్తే చాలు అబ్బబ్బబ్బా! ఆ వగచడాలు... ఆ ఆగడాలు! వద్దురా నాతండ్రీ! వద్దనే వద్దు. ఈ కొంప ఎప్పుడు అగ్గిబడి పోతుందో? నా చావు ఎప్పుడు చదరం చెయ్యబోతారో? పడిపడీ నా తల బట్టగట్టి పోతావుండాదే? కూసుంటే ఒక తప్పు. లేస్తే ఒక తప్పు. కొంపలోనే పడుంటే ఒక తప్పు. పడుండకపోతే ఒక తప్పు. ఒక పని చేద్దామంటే ఒక తప్పు. చెయ్‌కుండాపోతే ఒక తప్పు. ఇట్టా మాదిరి ఆ నోట్లో వచ్చేటివి మాట్లా? ఆ మాట్లు మల్లా చెప్పాలంటేగూడా శాతగాలా. అప్పటికి నేనేదో అనరాని మాటలు అంటా ఉణ్ణెట్టు! ఈ మొగోడు యినరాని మాటలు యింటా ఉణ్ణెట్టు! అదే ఆ నాలుగాళ్లమండపం కాడ నెత్తిన రూపాయి పెడ్తే దమ్మిడి యిలవ చెయ్యదు అదెవితో కుండాకోర్ ముండ! నలగరి ముందర పట్టుకోని నానా మాట్లంటా ఉంటే ఈ మొగోడు నోరు తెర్సినాడా? ఇంట్లో ఉండే నోరు యీదిలో ఉంటే ఇంకేం ఉండాది? నలగరిలో పైచెయ్యిగానే బతికుండొచ్చు. సడేలే! ఆడెవుడో చెప్పినట్టు చేసిన పాపం గోసిలో పెట్టుకోని కాశికి పోతే మాత్రం తీర్తిందా?"

మా బాశాలి ఉరమతా ఉండాది!

ఆ ఉరుములు మెరుపులు చూసి వాన కుర్సేది కాయమని షిలకాయలు ఉచ్చులు తెంపుకోని పాయ్ చాటుమాట్లో కాసింత చోటు సంపాయించు కుణ్ణారు. కొంపలో తబిలకు నోరొచ్చినట్టుండాది. అది డింగ్ డాంగ్ మని అరస్తా ఉండాది. చెంబుకు శాటకు కాళ్లొచ్చి నట్టుగా ఉండాది. అవ్వి టీవీ రామాయిణంలా బాణాల మాదిర అట్టాయిట్టా పరిగిత్తా ఉండాయి.

నేను బెల్లంగొట్టిన రాయి మాదిరి కూసోని అంతా గెమనిస్తా ఉండా.

''చెప్పే! ఎవురా నా సవితి? దాని జోలికి నువ్వు పోకుండా పోతే అది నీ జోలి కెందుకొస్తింది? దాన్ని నువ్వెంత నెత్తి కెక్కించు కోకుండా పోతే అది అంత నెత్తి నెక్కి మాట్లాడితింది? నలుగురు మొగోళ్ల ముందర ఒక పరాయి మొగోణ్ణి పట్టుకోని నానా కూతలు కుయ్యాలంటే అప్పిటికి యిద్దరికీ మద్దె ఎంత యవ్వారం నడస్తా వుండాల? చెప్పే! నా మొకం చూసి నిజం చెప్పే!''

''దేముడి సాచ్చిగా చెప్తావుండా అదెవుతో నాకు తెల్దు''

''వద్దే. వద్దే. ఈ సత్తాలు పెమాణాలూ వద్దే. ఈ సత్తాలు పెమాణాలతోనే గదే నా కొంప మూడారు దోవలు చేసింది. పోనీ చేసింది చాల్దా? ఇంకా చెయ్యాల్నా? హుఁ! చేసి చేసి యింకేం చెయ్యబోతారు? నా కడుపు మంట పెట్టుకో బోతారు? పెట్టుకోండి. పెట్టుకోండి. పెట్టుకుణ్ణె కొదవకు పెట్టుకోబోతారా?...

వద్దే! మనకొద్దే. మనకు ఉణ్ణికాడికి నీళ్లోనిప్పులో తాగేసి మనకొంపలో మనం గుట్టుగా పడుందామే? అంటే యింటాడా? యినడే.

దోవే తెలియని దానికి దోవ చూపంచె. దోవ దొరికేదాకా అది గూడా నాటకాలాడె. వొంగి వొంగి దండాలేనా? వయిపు దప్పితే సేవకాలేనా? బిడ్డల సాక్కుండే దానికి వచ్చినానని కల్లబొల్లి ఏడుపులేనా? ఎన్ని? ఒక దోవ దొరికే దాకా కాళ్లు బట్టె. దొరికే కుందికి జుట్టు బట్టె. ఈ ఆడోళ్లంతా యింతేనే. అచ్చొస్తే అక్కగారికి లేకుండాబోతే గురప్పడికి పెట్టే రకాలే! వాళ్ల జోలి మనకొద్దే అంటే కద్దు అని పోతాడు. మల్లా ఆ యిడ్సేసిన ముండలు యాదికే పెద్దలంటే తలకాయెత్తి కాళ్ల సందన పెట్టుకుంటాడు.''

''అయ్యో పాపం. పిలగాడు గదాని నేనేందో వొక మాటంటే అదెవుతో వాణ్ణి ఎనకేసుకోనొచ్చి నన్నంటే దానికి నేనేం చేసేది?''

''అయ్యో పాపం! అంటే ఆర్నెల్ల పాపం చుట్టుకుండే కాలం గదా యిది? వాడెవుడో ఏంపాడో? వాణ్ణి నువ్వెందుకు అనాల? అదెవితో దాని నోట్లో పుండు బుట్టా! యాడబుణ్ణె ముండో ఏంపాడో? అది నిన్నొక మాట ఎందుకనాల? దోవన పొయ్యే జగడం యింటిదాకా రాకుండాపోతే నీకు యాడ నిద్దర పట్టిందిలే.''

రబ్బరు మాదిర లాగతా వుంటే సాగతానే ఉంటింది యవ్వారం. అట్టా యాడికైనా దొరిపోతే ఈ పోరు కాసింత తప్పించుకోవచ్చని ఎలబార్తా వుండా.

''అడగతా ఉంటే అరీ గురీ మనకుండా పోతావుంటే ఎట్టేగేదమ్మా ఈ మొగోడ్తో? ఈ కొంపలో పిలకాయిల దోవ పిలకాయిలది. మొగోడి దోవ మొగోడిది. ఇంక నాకొక దానికే పట్టింది.'' అని చీది చీది ఎయ్‌లేదుగానీ చెరిగి శాటల్తో ఎత్తెత్తి పోస్తావుండాది యాష్టను!

''పొంగే దంతా పొయ్యిపాలే. చెరిగే దంతా గాలిపాలే. చేతల్లో సెగితుండే దాకా

చెరుక్కోనీలే!'' అని ఆపెను ఆపె దోవకే వదిలేసి నా దోవ నేను పట్టుకుంటి.

చుట్టపు చూపుగా వచ్చినట్టుండాయి మేగాలు!

మోడంలో పొద్దు మొగుడాల్ని చెరిస్తిందంటారు. యాడ చెర్సింది? చెడింది నేను. బయట పడింది నేను. బయిసి ఆర్సుకున్నింది నేను. ఈదిలో ఇంట్లో కూడా.

నా దోవ నాదిగా వుంటే మణుసు దోవ మణుసుదిగా ఉండాది.

నాలుగాళ్లమండపం సాచ్చిగా చెప్తావుండా. ఆ నాలుగాళ్లమండపం కాణ్ణే ఎన్నో మంచిపన్లు చేసినా. ఎదా? ఒక్క యదవ కూడా యింటికాడి కొచ్చి మా యింటామెతో యిదమ్మా నీ మొగుడు చేసిన మంచి పని! అని అనలేదే! ఒక దినం. కన్జీగిటి పడ్తాపడ్తా వుండాది. నాలుగాళ్లమండపం కాడ ఉన్నెట్టుండి కరెంటు పాయ. ఇంకాడ కత చెప్పాల్నా? ఆ చీగిట్లో ఆ జనంలో ఎట్టా తప్పొయ్యినాడో ఒక పర్సోళ్ల పిలగాడు తప్పొయ్యినాడు. యాత్రకని వొచ్చినోళ్లు గదా! ఏడికలు చూసుకుంటా పోతావుంటే వాళ్లదోవ వాళ్లదయింది. అప్పుడు ఆ పిలగాడు నాలుగాళ్లమండపం కాడ నిలబడుకోని దిక్కులు చూస్తా యాడస్తా ఉండాడు.

ఎవుడి బతుకులో ఏడుపు వాడిదిగా ఉంటే ఆ పిలగాడి ఏడుపు ఎవుడు చూస్తాడు?

వాణ్ణి సుతారించి వాడి చేతికొక అప్పచ్చి తీసిచ్చి... పోలీస్ టేసిన్ కాడికి తొడుక్కోని పొయ్యి ఊరంతా మైక్‌లో చెప్పించి వాళ్ల పిలగాణ్ణి వాళ్లకు అప్పచెప్పే కుందికి ఎందుకులే తల పాణం తోక కొచ్చింది.

ఇంకొక దినం. ఆ నాలుగాళ్లమండపం కాణ్ణే. రాజకీయంగా ఈడొక పార్టీ వాడొక పార్టీ. మాట మింద మాట వచ్చినట్టుండాది. ఇద్దురు మోటుకున్నారు. నాయాండ్లు మంచి పాయంమింద ఉండారు. పొగురు మిందుండే పొట్టేళ్లు డీ కొన్నెట్టుండాది. ఇద్దురికీ మంచి దెబ్బలు. రగతం చార్లచార్లగా కార్తా ఉండాది. చుట్టూరా గుంపు చేరుకోని అందురు ఏడిక చూస్తా ఉండారే కానీ అడుగు ముందుకేసే దానికి ఎవుడూ ముంపలా. నా కంట్లో పడేకుందికి అట్టాయిట్టా చూడకుండా దూర్నా. ఈడి జుట్టొక చేత్తో వాడి జుట్టొక చేత్తో యేసుకున్నా. ఇద్దురు నన్ను చూసిరి. అంతే! అట్టొకడు. ఇట్టొకడు. తిరిగి చూసుంటే వొట్టు!

''ఇంతసేపు నాయాండ్లు నీలిగి నీలిగి పడ్తావుండ్రే. బుట్లో పామై పోయ్‌రే. ఏం మంత్రం యేసినా వబ్బోడా!'' అని నవ్వతా ఒకపెద్దాయన అడగతా ఉండాడు.

పెగ్గె మాటలు కాదు. ఒకరు మెచ్చుకోవాలనీ కాదు. బగమంతుడిచ్చిన సెగితి ఉండాది. సెగితున్నె కాడికి శాతయింది చేస్తాం. అని యిట్టా మాదిర ఎన్నోచేసినా. అయినా ఒక్క నాయాలు గూడా వచ్చి మా బాశాల్తో అన్లా. ఇప్పుడు అది ఎవితో ఏంపాడో? గిరంసెణ్ణె ముండ. ఉండూరిది కూడా గాదు. ఏదో వొక పనికిమాలిన కూత కూసేకుందికి అంత మాటా తెచ్చి కొంపలో ముట్టించేసినారు.

మాకు మాకే జుట్లు ముడేసినారు.

ఇట్టా మాదిరి తంటలు పెట్టి ఉంటలు యారకతినే నాయాండ్లనే జుట్టుపోలిగాళ్ల అంటారు!

నా చిన్నప్పుడు మా ఊళ్లో గూడా ఒక జుట్టుపోలిగాడు ఉండె.

వాడు యాడైనా ఎదురుపడ్తే-

''ఒరే పోలిగా! పోలిగా! నాకల్లా సరిగ్గా సూడ్రా!'' అంటే 'నువ్వు పోరెడ్డా!' అనే వాడు. ఎందుకంటే వాడి కొకకన్ను ఊరు చూడమంటే ఉత్తరంచూస్తా ఉంటింది.

''ఒరే వొరే! కావాలంటే పది రూపాయలిస్తా. పరిగిత్తా పాయ్, ఆచెట్టును తాకేసి రాబోరా!'' అంటే-

''నీ పది రూపాయలు నాకొద్దులే!'' అంటాడు.

ఎందుకంటే వాడు నడస్తావుంటే మందగుది వొచ్చిన గొడ్డుకాలు యిరసకపాయ్ పణ్ణెట్టు వొక్కాలు పడ్తావుంటింది.

ఈడ్ని కొలిస్తే నాయాలు జానాబిత్తెడుండడు. అయితే మాత్రం శానా ఫలాతన్. మేగంలో నీళ్ల తెమ్మంటే తెస్తాడు. జుట్లో దూరి పొమ్మంటే అలాగ్గా దూరిపోతాడు. మల్లా చూసేదానికి మాత్రం నోట్లో ఏలుపెడ్తే కొరకలేని నంగనాచి టంగుబుఱ్ఱ మాదిరి అవుపిస్తాడు. అయితే మాట్లా? కోటలు దాటి పోతా ఉంటాయి.

మాఊళ్లో అయినేరోళ్ల మునసామి మామంటే అగ్గిరాముడే. శానా లెక్కాచారం మణిసి. కూలికి మణసల పెట్టుకుంటే వాళ్ల దుంపతెంచి గంపలకెత్తతాడు. జుట్టుపోలిగాణ్ణి చూస్తే- 'ఒరే నాయాలా! ఉడిగిపాయ్న వంకాయి పిందంతలేవు. నువ్వేందిరా నా యింట్లో పనికి కుదిరేది?' అనేవాడు. అటుమంటోణ్ణి ఎట్టా పట్టేసినాడో పటేసినాడు. ఆయింట్లో బఱ్ఱెగొడ్ల మేపేదానికి కుదురుకుణ్ణాడు.

పచ్చంగా ఉండే చోటు. అటుమంటి చోటు దొరికేదే గెగనం. దొరికింది గదా? హాయిగా పడుండచ్చు. అట్టా మాదిర పడుంటే వాడు జుట్టుపోలిగాడు ఎట్టవతాడు? ఆపక్కింట్లో పైటేసుకుండే పాయాని కొచ్చిన పిల్లతో పరాసికాలాణ్ణాడు. ఆ పిల్లది గమ్మునుండ్లా.

మునసామి మామ చెవుదాకా వచ్చింది.

ఆయన ముడ్డిమింద తన్తే మూతిపొండ్లు రాల్నాయి!

ఇంక నాకొడుక్కి ఈఊళ్లో మంచినీళ్ల గూడా పుట్టవనుకుణ్ణారు ఈళ్లూవాళ్లూ!

వాడేమో మూడుపూటలా లచ్చినంగా తినేసి తిరగతానే ఉండాడు.

''సరేలే! అయ్యోపాపం అని చూసీ చూడకుండా ఈ పల్లె కొంపల్లో వాళ్లూ ఈళ్లూ అంతో ఇంతో పెడ్తావుంటే తింటా ఉండాడు. ఈ బాగోతం కూడా ఎన్నాళ్లులే?'' అనుకుంటా ఉంటే వాడి వైబోగం చెప్పేదానికి అలివిగాకుండా మారిపాయ.

ఎట్ట పట్నాడో చిన్నపరెడ్డిని పటేసినాడు.

చిన్నపరెడ్డి చిన్న మణిసి కాదు. ఆయనది చిన్న సంసారమూ కాదు. పది మడకల సేద్దిం. పదిమంది వస్తా పోతా ఉండేది ఆ యింటి వైనం.

ఆ పాయికట్లో చిన్నపరెడ్డి మాటంటే చీమ చిటుక్కుమనదు. గాలి ఆడదు. ఇంక మణిసి తన మణుసు కొచ్చినాడా? మనా తనా రొండూ మర్సిపోతాడు. ఎత్తి నెత్తిన బెట్టు కుంటాడు. మణిసి మణుసుకు రాకుండా పొయ్యిందో యిసరట్టా పారేస్తాడు. వాడు యాడ పాయ్ పడ్తాడో దేముడికే ఎరిక!

చిన్నపరెడ్డి యాడికన్నా ఎలబార్తాడు. ఆ హంగుసింగులే యేరు. తేరు కదిలినట్టే ఉంటింది. తేరు కదల్తావుంటే పూలురాల్తా ఉణ్ణెట్టు ఆయన కదిల్తే ఎనక ఎప్పుడూ పది మందికి తక్కువ ఉండరు. ఎనక ఎంత మంది నడ్సినా వాళ్లల్లో ఏరిపెంచినట్టు వొక మణిసి. ఆ మణిసి వొగిటికాదు! చిన్నపరెడ్డి నీడ వొగిటి కాదు! ఆ మణిసి చేతిలో ఒక సంచి. అది సన్నాబన్నా సంచి కాదు. చిన్నపరెడ్డి పాణమంతా ఉండేది ఆ సంచి లోనే!

అటుమంటి సంచినే పట్టుకుండే మొగోడెవుడంటే? –

ఇంకెవుడు? జుట్టుపోలిగాడే!

ఇంక చూస్కో నాసామిరంగా వాడి వైబోగం! పాయికట్టు చూపంతా వాడి మిందే!!

''ఎనువుల తోకపట్టుకోని తిరగతా ఉణ్ణె నాయాలికి ఎంత వైబోగం వచ్చేసిందిరా?'' అని కొందురు అనుకుంటా ఉంటే–

''చిన్నపరెడ్డి చాపకిందికి చిన్నంగా నీళ్లొస్తే ఆనాయాలికి నీళ్లొదిలేయాల్సిందే గదా?'' అని కొందురు సమాదానపడ్తా ఉండారు.

అయితే అసలు కిటుకు తెల్సుకోవాలని అందురూ కటకటలాడ్తా ఉండారు. కాలం గడ్సిపోతానే ఉండాది. పోలిగాణ్ణి పట్టేదానికి పగ్గాలే లేకుండా ఉండాది.

వాడెంత? ఈడెంత?... ఆ నాకొడుక్కేం తెల్సు?... ఈ నాకొడుక్కేం తెల్సు?... అని వాగే దానిక్కూడా వాడికి దయిర్నం వచ్చేసింది.

పట్టు దొరికి పాయ! ఇంక పైకి ఎగబడి పొయ్యేదాక పనా?

అయితేమటుకు పెరిగేదంతా యిరిగే దానికే అంటారు పెద్దోళ్లు. ఒక దినం అట్నే జరిగిపాయ. మునక్కొమ్మ యిరిగినట్టు పెళపెళ యిరిగిపాయ. ఇరిగి ఈదల పాలైపాయ!

అదే చిన్నపరెడ్డి చిన పెండ్లాం!... చిన్నపరెడ్డికి యిద్దురు పెండ్లాల్లే. ఇల్లు తిరిగేది చేతికెత్తుకుణ్ణింది. జుట్టుపోలిగాడు యీదల మిందపడి పరిగిత్తా ఉంటే... రెడ్డెమ్మ చేతిలో పొరక్కట్ట ఏట్లాడ్తా ఉంటే!...

ఊళ్లోవాళ్లు కట్టలుగట్టి అదొక అరుసోద్దెంగా చూసినారనుకో!

అంతకాడికి ఎందుకొచ్చిందబ్బా! అంటే? -

చిన్నపరెడ్డికి చిలకల పిచ్చి జాస్తి. ఎగవూళ్లో ఒక చిలక. చూడచక్కని వయ్యారాల మొలక. చేతికి చిక్కినట్టే దక్కినట్టే ఉడకాడిపిస్తా ఉంటే జుట్టుపోలిగాడు ఎట్టిచ్చినాడో కన్నెక్షన్ యిచ్చేసినాడు. చేతికి సంచి కొట్టేసినాడు.

ఇది ఎట్నో ఏమో చిన్నపరెడ్డి చిన్నపెండ్లాం చెవల్లో పడింది.

జుట్టుపోలిగాడికి ఉచ్చిమింద బొచ్చు రాలి పొయ్యింది.

అదే ఆలోచించుకుంటా నాలుగ్గాళ్లమండపం కాడ పోతావుంటే ముత్తారెడ్డన్న ఎదురుపడె.

''ఏంరా అబ్బోడా? నిండా డీలాపడి పొయ్యుండావే?'' అని అడిగె.

''ఎవుడో నాయాలు జుట్టుపోలిగాడు. కొంపలో జుట్లు పట్టించె గదన్నా?''

ఆయన్న పకపక నవ్వె.

''దిగులుపట్ట్న కోడి తిన్నెమింద కూసోనుంటే పొగురు పట్టె కోడి పాటిక్ పాటిక్ మని పొడ్సేదానికి పొయ్యిందంట. అట్టుండాది గదన్నా నీ నవ్వు.''

''ఒరే పిచ్చోడా! ఈ జుట్టుపోలిగాడేందిరా? ఆలూ మొగుడు మద్దె పెట్నాడు. ఆలూ మొగుళ్ల కొట్లాట ఎంతసేపు? ఆరికకూడు ఉడికేదాకనే గదా? - అదే రాజకీయంలో ఉండారు జుట్టుపోలిగాళ్లు. నాయాండ్లు శానా తెలివిగా యిద్దరు నాయకుల జుట్లు పట్టించేస్తారు. ఇంక చూస్కోపో. దేశమంతా ఒకడి జుట్టు వొకడు పట్టుకుంటారు. ఈళ్ల నాయకుల జుట్లు పట్టిస్తే ఇంక కొందరుండారు. దేశానికి దేశానికి మద్దె పెట్టేస్తారు. అప్పుడు దేశ దేశాలే కొట్టుకోని చస్తాయి. అటువంటోళ్లను గురించి ఆలోచించకుండా యిదేందిరా?'' అనె.

''అవురా జుట్టుపోలిగాళ్లారా? మీది శానా పెద్ద కతగా ఉండాదే?'' అనుకోని నా యింటి కత మర్సిపోతి. ●